రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ విద్యార్థుల రెండో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ అధికారులు సోమవారం విడుదల చేశారు. బీఈడీ పరీక్షలకు 1,031మంది హాజరుకాగా 933 మంది ఉత్తీర్ణులయ్యారు. బీపీఈడీ పరీక్షలకు 296 మంది హాజరుకాగా 227 మంది, డీపీఈడీ పరీక్షలకు 48 మందికిగానూ 28 మంది పాసయ్యారు. వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో ఉన్న ఫలితాలపై ఎలాంటి సందేహాలున్నా 15రోజుల్లో పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

నేను మీ ఆర్టీసీ కాంప్లెక్స్‌ను..

శ్రీకాకుళం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):

నాలుగు దశాబ్దాలుగా మీకు సేవలందిస్తున్నా. కానీ నా గురించి పాలకులు పట్టించుకోవడం లేదు. చిన్నవాన వచ్చినా మునిగిపోతున్నా. నేనే కాదు.. నా వద్దకు వచ్చిన ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మోకాలు లోతు నీళ్లలో ఇక్కట్లు పడుతూ వృద్ధులు, మహిళలు బస్సులు ఎక్కుతుంటే నా ప్రాణం విలవిల్లాడిపోతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ నా బాగు కోసం నాయకులు హామీలు ఇస్తున్నారు. గెలవగానే మర్చిపోతున్నారు. నా ద్వారా ప్రభుత్వానికి రోజూ రూ.35లక్షల ఆదాయం వస్తోంది. ఇక పండుగ రోజుల్లో అయితే ఇది మరింత ఎక్కువ. కానీ రూ.65లక్షలు నా కోసం ఖర్చు పెట్టలేక పోతున్నారు. రెండు రోజుల ఆదాయంలో నా రూపురేఖలు కొద్దిగానైనా మారిపోతాయి. నా చెంతకు వచ్చే ప్రయాణికులకు కూడా సౌకర్యంగా ఉంటుంది. కానీ ఏప్రభుత్వమూ నిధులు ఇవ్వడం లేదు. ఎందుకు నా పట్ల ఈ వివక్ష? నా బాధను పట్టించుకోరా? కనీసం ప్రయాణికుల గోడు అయినా వినరా?

1981లో పట్టణానికి దూరంగా..

45 ఏళ్ల కిందట అంటే.. 1981లో శ్రీకాకుళం పట్టణానికి శివారున ఆర్టీసీ కాంప్లెక్స్‌గా పురుడుపోసుకున్నా. అప్పటికి పట్టణం ఇటుగా లేదు. పాతబస్టాండు నుంచి అటువైపే. ఆ తర్వాత కోర్టు, ఆర్ట్స్ కళాశాల వచ్చాయి. ఎస్పీ ఆఫీసు కూడా వచ్చింది. పట్టణం ఇప్పుడు నగరంగా మారి నడిబొడ్డున ఉన్నాను. ఒకప్పుడు చిన్నా పెద్దా.. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చి దూరాభార ప్రయాణం చేసేవారు. వాళ్లందరూ క్షేమంగా వెళ్లివస్తుంటే నాకు పట్టరాని ఆనందం. ఇప్పుడైతే నా వద్దకు వచ్చేవారూ.. పోయేవారూ.. దూరం నుంచి చూసేవారూ అసహ్యించుకుంటున్నారు. వర్షాకాలమైతే శాపనార్థాలు పెడుతున్నారు.

ఇదీ నాగురించి..

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌గా నా విస్తీర్ణం 6.5 ఎకరాలు. నాపరిధిలో ఉన్న శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2 డిపోలు పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. జిల్లా కేంద్రం కావడంతో వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు మూడొందలు వరకు బస్సులు వచ్చి వెళ్తుంటాయి. రోజుకి 80వేల మంది ప్రయాణికులు వస్తుంటారు.. వెళ్తుంటారు. ఇక్కడ ఉన్న రెండు డిపోల నుంచి ఆదాయం రోజుకు సుమారు రూ.35 లక్షల వరకు వస్తోంది. ఇంత ఆదాయాన్ని అందిస్తున్నా.. వేలాది మంది ప్రయాణికులు వచ్చి వెళ్తున్నా.. వందల బస్సులకు ఆశ్రయం కల్పిస్తున్నా.. ప్రజాప్రతినిధులు నన్ను పట్టించుకోవడం లేదు. పట్టణం నగరంగా మార్పు చెందాక.. నా చుట్టూ భవనాలు, ఇళ్లు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాలు, ప్రైవేటు భవనాలు వెలిశాయి. ఆఖరుకు రోడ్డు కూడా వెడల్పు అయింది. అప్పటి నిర్మాణం గనుక.. రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఉన్నా. అంటే రెండు అడుగుల లోతున ఉన్నా. దీనివల్ల వర్షం కురిస్తే.. నా ముందర ఉన్న డ్రెయిన్‌లో మురుగునీరు ఉప్పొంగి.. నేను మునిగిపోతున్నా. బస్సులు నిలిపే ప్రాంతమంతా నిండిపోయి సరస్సులా మారిపోతున్నా. నగరం అభివృద్ధి చెందుతున్న రీతిగానే.. అంచెలంచెలుగా నన్ను కూడా ఎత్తు పెంచితే బాగుండేది. దీన్ని ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ప్రయాణికులు మోకాలు లోతులో నడవాల్సి వస్తోంది. అదేనీటిలో బస్సులు ఎక్కాల్సి వస్తోంది. ఈ సమయంలో వారి బాధలు చూసి నా మనసు చివుక్కుమంటోంది.


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వరదనీటితో ప్రయాణికుల అవస్థలు (ఫైల్)

ఇలా చేయండి ప్లీజ్..

రోడ్డుకు ఆనుకుని ఉన్న భారీకాలువ నుంచి మురుగునీరు రాకుండా నన్ను నాలుగు అడుగుల ఎత్తు చేయాల్సి ఉంది. ఈ ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలుసు. నా ప్రాంగణాన్ని ఎత్తు చేసేందుకు రూ. 60 లక్షలు అవసరమని ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయమై శ్రద్ధ చూపాలని కోరుకుంటున్నా. ప్రజలు కూడా ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావాలని విన్నవించుకుంటున్నా. ఈ ప్రభుత్వ హయాంలోనైనా నన్ను అభివృద్ధి చేసే చర్యలు తీసుకోవాలని ప్రార్థిస్తున్నా.

-వేనువేల నమస్కారాలతో..
శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యం

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- తండేంవలసలో ఎరువుల పంపిణీ

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో ఖరీఫ్ సాగు అవసరానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందొద్దు' అని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సోమవారం శ్రీకాకుళం మండలం తండేంవలసలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు ఎరువుల పంపిణీ చేపట్టారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'జిల్లాలో 23వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. త్వరలో మరో 3వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రానున్నాయి. ఎరువుల కొరత లేదు. ఏడాది అంతటికీ ఒకేసారి నిల్వ చేసుకోవాలనే ఉద్దేశంతోనే (మిగతా 6వ పేజీలో..)


నరసన్నపేటలో యూరియా కోసం బారులుదీరిన రైతులు

యూరియా కోసం రైతుల బారులు 8లో

ఇక్కడ తింటే.. జబ్బులు ఉచితం!

- పుట్టగొడుగుల్లా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు
- మురుగు కాలువల పక్కనే నిర్వహణ
- కానరాని ఆహారభద్రతా నిబంధనలు
- అంతంతమాత్రంగా అధికారుల తనిఖీలు


శ్రీకాకుళంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రోడ్డుపక్కనే మురుగు కాలువల చెంతనే ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్లను విక్రయిస్తున్నారు. ఆహారభద్రతా శాఖ అధికారులు తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆహార పదార్థాల తయారీలో వాడిన నూనెను మళ్లీమళ్లీ వాడుతున్నారు. రుచి, వాసన పెరిగేందుకు ప్రమాదకర రసాయనాల మిశ్రమాలను వినియోగిస్తున్నారు. ఇవేవీ తెలియని ప్రజలు వాటిని తిని అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు.

- జిల్లాలో రెండువేల వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఆహారభద్రతా అధికారుల లెక్క ప్రకారం 1500 వరకు అనుమతి పొందినవి. మిగతావి అనధికారికంగా ఏర్పాటు చేసినవే. వాస్తవానికి వీటికి లైసెన్స్ తప్పనిసరి. ఆహార పదార్థాలపై ఎఫ్ఎస్ఎస్ఐ మార్క్‌తోపాటు నాణ్యతా ప్రమాణాలు, పరిమాణం, తయారీ తేదీ, గడువుతేదీ, ధర ముద్రించి విక్రయించాలి. వంటపాత్రలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక గది ఉండాలి. కానీ ఇవేవీ ఎక్కడా అమలు కావడం లేదు. చాలా హోటళ్లు, రెస్టారెంట్‌ల్లో వినియోగించిన పాత్రలు, గ్లాసులను పదే పదే కడిగి తిరిగి వాటిని వాడుతున్నారు. వంట మాస్టార్లు, సర్వర్లు తప్పనిసరిగా ఏప్రాన్స్, క్యాప్, చేతులకు గ్లౌజులు ధరించాల్సి ఉన్నా.. ఎక్కడా పాటించడం లేదు. కొన్ని రోజులు తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి దుర్వాసన వచ్చిన వాటిని నూనెలో వేయించి తమదైన శైలిలో ప్రజలకు అంటగడుతున్నారు. బాగా మరిగిన నూనెను మళ్లీ మళ్లీ వినియోగించరాదని వైద్యులు చెబుతున్నా.. పట్టించుకోకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పాడైపోయిన ఆహార పదార్థాలను వేడిచేసి ఇచ్చేస్తున్నారు. రెస్టారెంట్‌లు, డాబాల్లో మరీ దారుణం. తాగిన మత్తులో వచ్చిన వాడికి కల్తీ ఆహారాన్ని అందించి అధిక ధరతో దోపిడీ చేయడం జిల్లాలో సర్వసాధారణమైంది.



శిక్షణ లేకుండానే..

ఆహార పదార్థాలు తయారు చేసేవారు (కుక్‌లు) తప్పనిసరిగా శిక్షణ పొందాలి. కాని చాలామంది కొద్దిరోజుల పాటు హోటళ్లలో పనిచేస్తున్నారు. కుక్‌లుగా అవతారమెత్తుతున్నారు. కొందరు ఏకంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే జిల్లాకేంద్రంతోపాటు అన్ని ముఖ్య పట్టణాల్లో కర్రీ పాయింట్లు వెలుస్తున్నాయి. నాణ్యత లేని కూరలు, పప్పుతో పాటు ఇతర ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. కొన్ని హోటళ్ల మెస్‌లలో ఉదయం తయారు చేయగా మిగిలిపోయిన ఆహార పదార్థాలను రాత్రిపూట విక్రయిస్తున్నారు. ఇటువంటి వారిపై నిఘా పెంచడంతో పాటు ఆహార తయారీపై అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నించడం లేదు.

సిబ్బంది కొరత..

జిల్లాలో సరిగ్గా తనిఖీ చేపట్టకపోవడానికి ఆహారభద్రతా శాఖలో సిబ్బంది కొరత కారణమని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ లక్ష మంది జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 50వేల మందికి ఆక ఆహార భద్రతా అధికారులు ఉండాలి. ఈ లెక్కన ఒక్క జిల్లా కేంద్రంలోనే (మిగతా 6వ పేజీలో..)

మత్తు వదలడం లేదు

- జోరుగా గంజాయి రవాణా
- తాగుతున్న వారూ పెరుగుతున్నారు
- ఫలితమివ్వని పోలీసుల చర్యలు

6లో

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

- వేర్వేరు కేసుల్లో పట్టుబడిన ముగ్గురు

8లో

టెక్కలి టు ఒడిశా

- 11 టన్నుల రేషన్‌బియ్యం అక్రమ రవాణా
- కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడిన వైనం

పలాస, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. టెక్కలి నుంచి ఒడిశా రాష్ట్రం బరంపురానికి ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 11 టన్నుల రేషన్ బియ్యం కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డాయి. బియ్యం అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి లక్ష్మీపురం టోల్‌ప్లాజా వద్ద సీఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ నర్సింహమూర్తి, పోలీసులు తనిఖీ చేశారు. టెక్కలి నుంచి ఒడిశా వెళ్తున్న ఓ ఐచర్ వాహనంలో గోనెసంచుల మూటలు కనిపించాయి. అందులో 11టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు.


వాహనంతో పట్టుబడిన రేషన్ బియ్యం

వ్యాన్‌తోపాటు బియ్యాన్ని కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ ఎస్.తిరుపతిరావు, వీఆర్వోలు సంఘటన స్థలానికి చేరుకొని బియ్యం ఎక్కడ నుంచి ఎక్కడకు రవాణా చేస్తున్నారో సంబంధిత వాహనం డ్రైవర్ సంజయ్‌కుమార్‌సమాల్‌ను అడిగి తెలుసుకున్నారు. బియ్యం అక్రమ రవాణాపై 6ఏ కేసు నమోదు చేశామని (మిగతా 6వ పేజీలో..)

కొత్తమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించాలి

- మంత్రి అచ్చెన్నాయుడు
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

7లో

సిక్కోలులో రహదారి ఆక్రమణలు

- భారీ వాహనాలూ రోడ్డుపైనే
- తరచూ ప్రమాదాలు

6లో

ఎరువుల దుకాణాలపై 'విజిలెన్స్'

8లో



ఆలయాల్లో పూజలు పునః ప్రారంభం 6లో

అరసవల్లిలో ఆలయం తలుపులు తెరుస్తున్న అర్చకులు

రూ.60 లక్షలు కట్టండి

- నీటి సంఘం అధ్యక్షులకు పన్నుల షాక్

టెక్కలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సుమారు ఎనిమిదేళ్ల కిందట చేసిన పనులకుగానూ.. పన్నులు చెల్లించాలంటూ నీటి సంఘం అధ్యక్షులకు వాణిజ్య పన్నుల శాఖ నోటీసులు జారీచేసింది. 2017-18 మధ్య టెక్కలి పరిధిలో 16 నీటిసంఘాలు, రెండు డిస్ట్రిబ్యూటరీలు.. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి పనులు చేపట్టారు. ఇటీవల వాటికి సంబంధించి కొంతమేర బిల్లులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో 18శాతం ట్యాక్స్ చొప్పున సుమారు రూ.60లక్షలు చెల్లించాలంటూ నీటి సంఘాల అధ్యక్షులకు వాణిజ్య పన్నులశాఖ నోటీసులు జారీ చేయడంతో వారంతా ఖంగుతిన్నారు. టెక్కలి పరిధిలో భీంపురం, బన్నువాడ, రావివలస, కవిటి అగ్రహారం, మర్రిపాడు తదితర నీటి సంఘాలతోపాటు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌కు నోటీసులందాయి. వాస్తవానికి ఐదుశాతం జీఎస్టీకిగానూ 18 శాతం వసూలుకు నోటీసులు జారీచేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండుశాతం జీఎస్టీని చెల్లించగా.. తిరిగి రూ.లక్షల్లో పన్ను నోటీసులు పంపడం తగదని వాపోతున్నారు. ఈ విషయమై వంశధార ఈఈ బి.శేఖరరావు వద్ద ప్రస్తావించగా 'వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అవగాహన లేక రూ.లక్షల్లో నోటీసులు జారీచేశారు. దీనిపై నీటిసంఘాల అధ్యక్షులకు సమాధానం ఇవ్వాల్సి ఉందన్నారు.


ఆటోపై పడిన తాటిచెట్టు, విద్యుత్ వైర్లు

తప్పిన ముప్పు

- ఆటోపై పడిన తాటిచెట్టు, విద్యుత్‌వైర్లు

రణస్థలం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం. విద్యార్థులు ఈ రహదారి వెంబడి పాఠశాలకు వెళ్తుంటారు. ఓ వైపు మోస్తరుగా వర్షం కురుస్తోంది. అదే సమయంలో తాటిచెట్టు విరిగి.. విద్యుత్ వైర్లపై పడింది. క్రమేపీ తాటిచెట్టు, విద్యుత్‌వైర్లు కలిపి.. అక్కడే రోడ్డుపై నిలిపిన ఆటోపై పడ్డాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రణస్థలంలోని రామతీర్థం రోడ్డు జడ్పీ హైస్కూల్ సమీపాన సోమవారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మార్గంలో నిత్యం హైస్కూల్ విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఆటోలు, బస్సులు తిరుగుతుంటాయి. తాటిచెట్టు విరిగి.. విద్యుత్‌వైర్లతో సహా ఆటోపై పడిపోవడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఘటనా స్థలానికి పోలీస్, విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని తాటిచెట్టును తొలగించారు. రాత్రి 7గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఆలయాల్లో పూజలు పునః ప్రారంభం



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు



అరసవల్లి: ఆదిత్యుని దర్శనానికి వెలుతున్న భక్తులు



అరసవల్లి: పుష్కరిణిలో భక్తుల స్నానాలు



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకుడు

అరసవల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం ఆలయాలను తెరిచి..సంప్రోక్షణలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనానికి అవకాశం కల్పించారు. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, రావివలస ఎండలమల్లికార్జున, తదితర ఆలయాలు సోమవారం ఉదయం తెరుచుకున్నాయి. అరసవల్లి శ్రీ సూర్యదేవుని ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మూసివేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఆలయాన్ని తెరచి.. విఘ్నేశ్వర పూజ, శుద్ధి, పుణ్యాహవచనం (సంప్రోక్షణ), స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు ఆలయ ద్వారాలను తెరిచి ఉదయం 8 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. భక్తులు తొలుత ఆలయ ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అక్కడే గల అశ్వత్థ వృక్షం వద్ద ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలను కూడా సిబ్బంది పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, నేతింటి హరిబాబు, షణ్ముఖశర్మ, రంజిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనమే ప్రభుత్వ లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయి. రబీలో రాష్ట్రానికి 9.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేటాయించేందుకు కేంద్రం అంగీకరించింది. రబీ కోసం ఇప్పుడే ఎరువులు నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదు. మోతాదుకు మించిన ఎరువులు వినియోగిస్తే ఆరోగ్యపరమైన ఇబ్బందులు వస్తాయి. దీనిపై రైతులకు అవగాహన పెంపొందించుకోవాల'ని తెలిపారు. యూరియా అధిక ధరకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం శ్రీకాకుళంలో ప్రత్యేకంగా ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'యూరియా అవసరం మేరకు వినియోగించాలి. ఎక్కువగా వాడితే వరిపంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రైవేటు దుకాణాల్లో కూడా ప్రభుత్వం అందించిన ధరకే యూరియా లభ్యమవుతుంది. వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో అధిక దిగుబడి సాధించాల'ని తెలిపారు.

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'అక్రమంగా నిల్వలు చేస్తే సమచారం ఇవ్వాలి. ప్రతీ హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వం మాదే. ఏడాదిలోనే తండేంవలస గ్రామంలో కోట్ల రూపాయలతో రహదారులు నిర్మించామ'ని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, తహసీల్దార్ ఎం.గణపతి, మండల వ్యవసాయ అధికారి పి.నవీన్, ఎంపీడీవో శైలజ, మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు, సర్పంచ్ కూర్మారావు, అంబటి వైకుంఠం, రైతులు పాల్గొన్నారు.

సిక్కోలులో రహదారి ఆక్రమణలు

● భారీ వాహనాలూ రోడ్డుపైనే ● ఇరుకుగా మారుతున్న మార్గం ● తరచూ ప్రమాదాలు



రహదారిపైనే పండ్ల దుకాణం



రోడ్డుపైనే ఆటోల నిలిపివేత



అస్తవ్యస్తంగా ట్రాఫిక్

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పరిధిలో రామలక్ష్మణ జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు ఉన్న ప్రధాన రహదారిపై ఆక్రమణలు పెరిగిపోయాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు రోడ్ల పైకి వచ్చేశాయి. దుకాణదారులు, గృహ యజమానులు రోడ్డు, కాలువలపైన ఇళ్ల మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడంతో వాహనదారులకు, పాదచారులకు కష్టాలు తప్పడం లేదు. దీనికి తోడు రోడ్డు పొడవునా తోపుడు బళ్లు ఉంటున్నాయి. చిరు వ్యాపారులు కావడంతో ఎవరూ వారి వైపు చూడడం లేదు. దీనిని ఆసరాగా తీసుకొని తోపుడుబండ్లపైన, రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు సాగించే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రామలక్ష్మణ జంక్షన్ దాటాక పోలీసుల పర్యావేక్షణ ఉండకపోవడం వీరికి వరమవుతోంది. కొన్ని చోట్ల రహదారి మరీ ఇరుగ్గా తయారైంది. వీరికి తోడు రోడ్డు పొడవునా చిన్న, పెద్ద వాహనాలు రోజుల తరబడి నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కార్లు,లారీలు,క్రేన్‌లు, ట్రాక్టర్లు రోడ్లను ఆక్రమిస్తున్నాయి. దీంతో కొన్నిచోట్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు, మున్సిపల్ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి... ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఇక్కడ తింటే.. జబ్బులు ఉచితం!

(ఐదో పేజీ తరువాయి)

ఆరుగురు ఉండాలి. ఇచ్ఛాపురం, పలాస, కాశీబుగ్గ, ఆమదాలవలస, రాజాం, పాలకొండ మునిసిపాలిటీల్లో కనీసం ఇద్దరు చొప్పున ఉండాలి. ప్రస్తుతం జిల్లాలో కేవలం ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఉన్నారు. జిల్లాకు ఆహార కల్తీ నియంత్రణాధికారి కూడా ఇన్‌చార్జిగా విజయనగరం జిల్లా నుంచి వస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంతో ఫాస్ట్‌ఫుడ్, హోటళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తనిఖీలు చేస్తున్నాం..

జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం. నిబంధనలు పాటించని వారిపై చర్య లు తీసుకుంటున్నాం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు నెలాఖరు వరకు జిల్లాలో 85 హోటళ్లపై దాడులు చేశాం. 8 హోటళ్లలో కల్తీ జరిగినట్టు గుర్తించి.. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. ఆహారంలో రంగులు వేసి వి క్రయిస్తే చర్యలు తప్పవు. ప్రతి ఒక్కరు లైసెన్స్‌తో వ్యాపారాలు చేయాలి.

-లక్ష్మి, శ్రీకాకుళం డివిజన్-1 ఫుడ్ ఇన్‌స్పెక్టర్

వర్షంతో ఇక్కట్లు



పాతపట్నం: జలమయమైన సబ్ జైలు ప్రాంగణం

నరసన్నపేట/ పాతపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా నరసన్నపేట, పాతపట్నం తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఈ రెండు మండలాల్లోనూ కుండపోత వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు, వీధులు జలమయమయ్యాయి. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పొలాలు నీట మునిగాయి.

బాతువలో..

జి.సిగడాం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాతువ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో గ్రామ సమీపంలోని మంకోడితోట గెడ్డ, బంగ్లాతోట గెడ్డలు ఒక్కసారిగా పొంగి పొర్లాయి. పంట పొలాలు నీట మునిగాయి. వరద నీటితో బాతువ ప్రధాన బీటీ రహదారి సాగునీటి కాలువను తలపించింది. ప్రయాణికులు, ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామానికి సుమారు కిలోమీటరున్నర దూరంలో ఉన్న పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి వచ్చేందుకు ఇబ్బందులకు గురయ్యారు. పిల్లలను తమ తల్లిదండ్రులు దగ్గరుండి వరద నీటిని దాటించారు. బాతువ వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించడంతో ఈ రెండు గెడ్డల నీరు పోయేందుకు అవకాశం ఉండడం లేదని, దీంతో వర్షాకాలంలో రోడ్డుపైకి వరదనీరు వస్తుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



నరసన్నపేట: గొట్టిపల్లి అండర్ పాసేజ్ వద్ద నిలిచిన నీరు



జి.సిగడాం: బాతువ-చీపురుపల్లి ప్రధాన రహదారిపై నీటిలో ప్రయాణికుల ఇబ్బందులు

మత్తు వదలడం లేదు

● జోరుగా గంజాయి రవాణా

● తాగుతున్న వారూ పెరుగుతున్నారు

● ఫలితమివ్వని పోలీసుల చర్యలు



గంజాయి ముఠా సభ్యులతో పోలీసులు (ఫైల్)

పలాస, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పలాస డివిజన్‌లో గంజాయి రవాణా రోజురోజుకూ అధికమవుతోందే తప్ప... తగ్గడం లేదు. గంజాయి తాగేవారి సంఖ్య కూడా పెరిగిపోతుండడంతో దీన్ని నియంత్రించడంలో యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 4వ తేదీ ఒకేరోజు డివిజన్‌లోని 3 ప్రాం తాల్లో గంజాయి స్మగ్లర్లు పోలీసులకు చిక్కడం సంచలనం రేకెత్తించింది. అందులో మహిళలు కూడా ఉండడం ఆందోళనకరమైన విషయం. ఇదిలా ఉండగా గంజాయి రవాణాదారుల పైనే దృష్టి సారిస్తున్న పోలీసులు... దానిని తాగుతున్న వారిని విడిచిపెడుతున్నారు. దీనిపై ఎటువంటి నిఘా లేకపోవడంతో కిలోల కొద్దీ గంజాయి దిగుమతి అవుతోంది. వారానికో సారి డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతుండడంతో ఎటువంటి ఫలితాలు ఇవ్వడం లేదని సాక్షాత్తూ పోలీసు అధికారులే చెబుతున్నారు. ఉన్నతాధి కారుల మెప్పు పొందడానికి తప్ప అవి ఉపయోగపడడం లేదనేది స్పష్టమవుతోంది. కెమెరా నిఘాలో కేవలం పేకాట శిబిరాలు తప్ప ఇతర నేరాలు పసిగట్టలేకపోతున్నారు. గంజాయి ఎక్కువగా ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా, మోహన సమితి, ఆర్.ఉదయగిరి ప్రాంతాల నుంచి పలాస రైల్వేస్టేషన్‌కు చేరుతోంది. పోలీసులకు అక్కడి వారు సమాచారం ఇస్తుంటే తప్ప గంజాయి రవాణాదారులను పట్టుకోలేక పోతున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని ఓ మత్స్యకార గ్రామానికి చెందిన వ్యక్తులు కొంతమంది ముంబయి, కేరళ, చెన్నై వంటి ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఒడిశాలో చౌకగా లభించే గంజాయిని కొనుగోలు చేసుకొని దారి ఖర్చులకు పని చేస్తాయని వాటిని అక్కడికి రవాణా చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితం దొరికిన గంజాయి స్మగ్లర్లలో తీరప్రాంత వ్యక్తులు ఉండడం గమనార్హం. కేవలం ఒడిశా నుంచే కాకుండా ఈ ప్రాంతం వారు కూడా గంజాయిని రవాణా చేస్తున్నారన్నది స్పష్టమవుతోంది. పలాస రైల్వేస్టేషన్ రోడ్డులఅనేక మంది యాచకులు గంజాయి తాగుతున్నారు. గతంలో ఒకరిద్దరు ఉండగా... ప్రస్తుతం వారి సంఖ్య పదుల సంఖ్యకు చేరుకుంది. వారితో పాటు యువకులు, శ్రామికులు కూడా గంజాయికి అలవాటు పడి ఘర్షణలు పడుతుండడం చర్చనీయాంశంగా మారింది. వీరికి గంజాయి ఎక్కడి నుంచి వస్తోందో పోలీసులు నిఘా పెట్టాల్సి ఉంది. రెండేళ్ల క్రితం ఓ వికలాంగుడు గంజాయి తీసుకువచ్చి ప్యాకెట్ల రూపంలో అమ్మకాలు చేయడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి ఆ వ్యక్తి ఒడిశా వైపు వెళ్లిపోయాడు. ఆ కారణంగా కొన్ని రోజులు గంజాయి అమ్మ కాలు ఆగాయి. అనంతరం మళ్లీ గంజాయి పీల్చే వారి సంఖ్య పెరిగిపోతుండడంతో రవాణాపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఒడిశా బోర్డర్‌లో పలాస రైల్వే స్టేషన్ ఉండడంతో సులభంగా గంజాయి తీసుకువచ్చి గుట్టుగా అమ్మకాలు సాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. దీనిపై పోలీసులు గట్టి నిఘా పెట్టి అమ్మకందారులతో పాటు రవాణాదారులపై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ గంజాయిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఒడిశా బోర్డర్ ప్రాంతంలో నిఘా పెట్టామన్నారు. గంజాయి రవాణా చేసినా... తాగినా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పలాస రైల్వే స్టేషన్ రోడ్డులో గంజాయి తాగుతున్న యాచకులు

రాత్రి పూట.. బతుకు వేట



వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు



నాగావళి నదిలో చేపల వేట సాగిస్తూ..

● నాగావళి నదిలో చేపల కోసం ఆరాటం

అరసవల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పొట్ట కూటి కోసం సాగించే పోరాటానికి పగలూ రాత్రీ తేడా తెలియదు. ఇదిగో ఈ మత్స్యకారులదీ అదే పరిస్థితి. చేపలవేటే వీరికి ఆధారం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పగలంతా నాగావళి నది ప్రవాహం అధికంగా ఉంటోంది. రాత్రి కాస్త ప్రశాంతంగా ఉంటోంది. దీంతో కొందరు మత్స్యకారులు రాత్రి వేళల్లో.. చీకటిలోనే చేపలవేట సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో చేపలు నీటి పైభాగానికి వస్తుంటాయని... ఆ సమయంలో వేట సులువవుతుందని శ్రీకాకుళంలోని దమ్మల వీధికి చెందిన మత్స్యకారులు అంటున్నారు. దీని వల్ల తమ శ్రమకు ఫలితం ఉంటుందని చెబుతున్నారు. తలకు టార్చిలైట్ పెట్టుకొని... చేతిలో వలలతో ఇలా నదిలో చేపల కోసం ప్రయత్నిస్తున్నారు.



ఎన్ని చేపలు చిక్కాయో...

టెక్కలి టు ఒడిశా

(ఐదో పేజీ తరువాయి)

తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి తెలిపారు. జేసీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సమీపంలో ఉండే డీలర్ స్టాక్‌పాయింట్‌కు తరలిస్తామని తెలిపారు. సీఐ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ రెవిన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు తాము కూడా కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

● టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని వివిధ వర్గాల ద్వారా కొనుగోలు చేసి.. ఒడిశాలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక్కడ కిలో రూ.18కు కొనుగోలు చేసి ఒడిశాలో రూ.40 వరకూ విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో చాలామంది వ్యాపారులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ లాభపడుతున్నారు. దీని నియంత్రణపై అధికారులు మరింత నిఘా ఏర్పాటు చేయాల్సి ఉందని పలువురు పేర్కొంటున్నారు.

కొత్తమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించాలి

● మంత్రి అచ్చెన్నాయుడు

● ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పండుగగా కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 25వరకు జరగనున్న కొత్తమ్మతల్లి జాతర ఏర్పాట్లపై శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తిచేయాలని సూచించారు. లక్షలాది మంది భక్తులు అమ్మ వారిని దర్శించుకోనున్నారని.. ప్రముఖ ఆలయాల తరహాలో క్యూలైన్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉచిత దర్శనానికి ప్రాధాన్యమివ్వాలని వెల్లడించారు. శోభాయాత్ర, గ్రామీణ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్, ఫైర్‌వర్క్స్, హెలికాప్టర్ రైడింగ్ వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిరోజు 25వేల మందికి అన్నదానం నిర్వహించాలని, అందులో మజ్జిగ కూడా ఉండాలని చెప్పారు. చిన్నపిల్లలకు పాలు, భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించాలని చెప్పారు. క్యూలైన్లు, బారికేడ్లు టెంట్లు, లౌడ్‌స్పీకర్లు, డ్రోన్ కెమెరాలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఆన్‌లైన్ సిస్టమ్, శానిటేషన్, వైద్య శిబిరాలు, ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సుల ఏర్పాటుపై అన్ని విభాగాల సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, పీఏసీఎస్ మాజీచైర్మన్ కింజరాపు హరిప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

20 ఏళ్లూ కూటమిదే అధికారం

● త్వరలో వైసీపీ గల్లంతు ● ఎమ్మెల్యే రవికుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'అసత్య ప్రచారాలతో ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైసీపీ త్వరలో కనుమరుగవ్వడం ఖాయం. మరో 20 ఏళ్లు కూటమిదే అధికారం' అని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన స్త్రీశక్తి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. సూపర్‌సిక్స్ హామీలో భాగంగా మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు చెప్పారు. ఏడాది పాలనలో నియోజకవర్గంలో రూ.530 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల సరిహద్దు ప్రాంతంలో మన పిల్లల భవిష్యత్తు కోసం రూ.30 వేల కోట్లతో 3,200 మెగావాట్ల థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొంతమంది వైసీపీ పిల్ల సైకోలు పరిశ్రమలు, ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. ఆర్థిక ఉగ్రవాది మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి త్వరలో జైలుకి వెళ్లడం ఖాయమన్నారు. సమావేశానికి ముందు మహిళలతో కలిసి ఎమ్మెల్యే పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ మొదలవలస రమేష్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి

● ఎమ్మెల్యే గొండు శంకర్


సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు.సింగుపురం జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నిరక్ష్యరాస్యత కారణంగా సమాజం అభివృద్ధి చెందడం లేదన్నారు. విద్యతోనే మన హక్కులు కాపాడుకోగలమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో సైన్సు, మ్యాథ్స్ ల్యాబ్ లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండ అదిత్య నాయుడు, ఎంపీటీసీలు, విద్యా కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పోలీసు జాగిలం టినా మృతి


టినా భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీసు శాఖలో ఏడేళ్ల పాటు విశేష సేవలందించిన పోలీసు జాగిలం టినా అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందింది. ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు కార్యాలయ ఆవరణలో అదనపు ఎస్పీ కేవీ రమణ టినా భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ శేషాద్రి, ఆర్ఐ శంకరప్రసాద్, ఆర్ఎస్ఐలు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, టినా లాబ్రడార్ జాతికి చెందినది. 2019లోని విజయవాడలోని మంగళగిరిలో 6వ బెటాలియన్ డాగ్ స్క్వాడ్ శిక్షణ కేంద్రంలో (పేలుడు పదార్థాలు స్నిఫర్ డాగ్ లేదా డిటెక్షన్ డాగ్) స్నిపర్ డాగ్‌గా శిక్షణ పొందింది.

నేత్ర దానంపై అవగాహన అవసరం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నేత్ర దానంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని అంబేడ్కర్ యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య అన్నారు. వర్సిటీలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్, మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం సంయుక్తంగా నేత్ర దానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదానం ఆవశ్యకతను వివరించి ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు. వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జెమ్స్ ఆసుపత్రిలో..

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జెమ్స్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ డైరెక్టర్ డా.హేమంత్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయడాన్ని ఒక సంప్రదాయంగా పాటించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ పుష్పలత, నేత్రవిభాగాధిపతి సతివాడ లక్ష్మి, వైద్యులుఎ శ్రీనాథ్‌రెడ్డి, డి.ప్రవీణ్, ఎస్.విజయభాస్కరరావు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రిమ్స్ రేడియోగ్రాఫర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

శ్రీకాకుళం రిమ్స్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రిమ్స్ రేడియోగ్రాఫర్ బి.సత్యనారాయణపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ట్రామాకేర్‌లో నియామక ఆర్డర్లకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించారనే అభియోగంపై సత్యనారాయణను 2015 మే 28 నుంచి 2016 అక్టోబరు 31 వరకు అధికారులు సస్పెండ్ చేశారు. అలాగే, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీనిపై సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించడంతో, ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆయనపై ఉన్న డిపార్ట్‌మెంటల్ చార్జీలను కూడా కొట్టివేస్తూ ఈ ఏడాది జూలై 22న తీర్పు వెలువడింది. ఈ నేపథ్యంలో ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి మొవ్వా తిరుమల కృష్ణబాబు పేరుతో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన సస్పెన్షన్ కాలాన్ని ఆన్ డ్యూటీగా పరిగణించి, అన్ని సేవా ప్రయోజనాలు కొనసాగనున్నాయి.

జెమ్స్‌లో ప్రపంచ ఫిజియోథెరపీ వేడుకలు

అరసవల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):రాగోలులోని జెమ్స్ ఫిజియోథెరపీ కాలేజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఫిజియోథెరపీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమంలో భాగంగా జెమ్స్ విద్యార్థులు పోస్టర్, పోడియం ప్రజెంటేషన్స్ పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది థీమ్ అయిన హెల్తీ ఏజింగ్ (ఆరోగ్యకర వృద్ధాప్యం) గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. అలాగే ఆస్ట్రేలియాలో ఫిజియోథెరపిస్టులుగా పనిచేస్తున్న డా.శ్రీనివాస్, డా.అశోక్‌కుమార్ ఆన్‌లైన్ వెబినార్ ద్వారా జెమ్స్ ఫిజియోథెరపీ విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం అక్కడ అనుసరిస్తున్న జెరియాట్రిక్ ఫిజియోథెరపీ విధానం, వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు, వాటి పరిష్కారాలను తెలియజేశారు. వృద్ధాప్యంలో వచ్చే వివిధ మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను డా.సౌజన్య, డా.బరాటం సంతోష్‌కుమార్ వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.రాహుల్ షేక్ కోరారు. రాబోయే రోజుల్లో దేశంలో వృద్ధుల సంఖ్య పెరుగుతుందని, వారికి కావాల్సిన జీవన విధానం, వ్యాయామాలను ముందుగా తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో డా.శ్రీధర్‌రెడ్డి, మెడికల్ డైరెక్టర్ డా.హేమంత్, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఎందువను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ఎందువలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పురాతన దేవాలయాలు ఉన్న ఎందువ గ్రామాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) హామీ ఇచ్చారు. సోమవారం ఎందువలో నిర్వహించిన నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించటమే తమ లక్ష్యమన్నారు. నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఎందువలో రహదారుల నిర్మాణానికి రూ.1.90 కోట్లు, తాగునీరు అందించేందుకు రూ.63 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ముందుగా నడిమివలసలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, సర్పంచ్ అల్లు జోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే బెందాళం అశోక్


ఎరువుల వినియోగంపై కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోమవారం రామయ్యపుట్టుగలో ఎరువుల వాడకంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని, అధిక మోతాదులో వాడితే నష్టాలు వస్తాయని అన్నారు. అనంతరం ఎరువుల వినియోగంపై కరపత్రాలను విడుదల చేశారు. తహసీల్దార్ వెంకటరావు, ఎంపీడీవో రామారావు, ఏవో అజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

39 టన్నులు సిద్ధం..

సోంపేట/రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో 39 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయశాఖ ఏడీ టి.భవానిశంకర్, ఏవో బి.నరసింహమూర్తి అన్నారు. మండలంలో సోమవారం వివిధ చోట్ల జరిగిన ఎరువుల పంపిణీని వారు పరిశీలించారు. రైతులందరికీ సరిపడేలా ఎరువులు అందిస్తామని తెలిపారు.

ఎరువులు అందించండి

కంచిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల రైతాంగానికి అవసరమైన ఎరువులను అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఆందోళన వద్దు: ఆర్డీవో

సరుబుజ్జిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవసరం మేరకు యూరియా ఇతర ఎరువులు సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. సోమవారం రాత్రి సరుబుజ్జిలిలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్ ఆధ్వర్యంలో రైతులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రైవేటు దుకాణాల ద్వారా కాకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేయాలని రైతులు ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కె.గోవిందరావు, డీటీ జగదీష్, టీడీపీ నాయకులు దవళ సింహాచలం, ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్, ఇల్లాకుల ప్రభాకర్, ఎండ దొరబాబు, కూటికుప్పల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వెంటనే సరఫరా చేయాలి: సీపీఐ

అరసవల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే సరఫరా చేయాలని సీపీఐ జిల్లా నాయకులు బి.సంతోష్, టి.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లబ్బరాజు, బమ్మిడి రాంబాబు, సత్యంనాయుడు, ఎల్.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

లావేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో పి వెంకటరాజు, తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తాళ్లవలస రైతుసేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

● పీజీఆర్ఎస్‌కు 75 వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలుపై అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలపై 75 వినతులను జేసీ స్వీకరించారు. ● తమ గ్రామానికి రోడ్డు వేయాలని సారవకోట మండలం చిన్న కిట్టాలపాడు పంచాయతీ, బొంతుగూడ గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. గత 25 ఏళ్లుగా తమ గ్రామంలో రోడ్లు, కాలువలు లేవన్నారు. తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలు పరిష్కరించాలని జేసీకి వినతిపత్రం అందజేశారు. ● తన తల్లి పేరిట ఉన్న 5.30 ఎకరాల భూమిని స్థానిక గ్రామాధికారులతో కలిసి ఆక్రమించేందుకు స్థానిక రాజకీయ నాయకుడు ప్రయత్నిస్తున్నారని, దీనిపై విచారణ చేసి, తనకు న్యాయం చేయాలని శ్రీకాకుళం రూరల్ మండలం కణుగులవానిపేటకు చెందిన ఇప్పిలి వెంకట శివలక్ష్మీప్రసాద్ గ్రీవెన్స్‌లో విన్నవించాడు. ● గత 11 నెలలుగా ఇమామ్‌లు, మౌజన్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించడం లేదని, తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని నగరానికి చెందిన పలువురు ముస్లిం నేతలు జేసీని కోరారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఉప కలెక్టర్ బి.పద్మావతి, డిప్యూటీ కలెక్టర్(డీఎంపీసీ) టి.వేణుగోపాలరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 52 ఫిర్యాదులు..

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వ రరెడ్డి నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆస్తి తగాదాలు, కొట్లాట తదితర సమస్యలపై 52ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులు అన్నింటిపై చట్టం ప్రకారం విచారణ జరిపి సత్వరం పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

కోటేశ్వరాలయంలో న్యాయాధికారి పూజలు


స్వామి సన్నిధిలో న్యాయాధికారి కుటుంబం

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామిని జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయాధికారి ఎస్.ఎం.ఫణికుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించారు. చాతుర్మాస దీక్షలో భాగంగా విశాఖపట్నం భువనేశ్వరి పీఠంకి చెందిన శ్రీరామనందభారతి స్వామీజీ, మౌనానంద.. కోటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీరామశర్మ, పాలకమండలి చైర్మన్ దేవేంద్ర నాయుడు, కోరాడ రమేష్, అధిక సంఖ్యలో భక్తులు స్వామీజీని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఈవో మునగవలస సుకన్య పాల్గొన్నారు.

ఎట్టకేలకు చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఎక్స్‌కవేటర్‌తో చెత్త తొలగిస్తున్న దృశ్యం

సోంపేట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లవూరు గ్రామ రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎట్టకేలకు తొలగించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ఇది గొల్లవూరు రహదారి పరిస్థితి కథనంపై స్థానిక సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది స్పందించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగించారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్రంటీస్‌తో ఉపాధి అవకాశాలు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అప్రంటీస్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీఐ ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎంవీ రమణమూర్తి అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి జాతీయ అప్రంటీస్ మేళాను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్రంటీస్ తప్పనిసరిగా చేయాలన్నారు. అప్రంటీస్ మేళాకు 214 మంది హాజరుకాగా, 13 కంపెనీలకు 79 మందిని ఎంపిక చేశారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. 9 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలో, 15 నుంచి 17వరకు డివిజనల్ స్థాయిలో, 18 నుంచి 23 వరకు జిల్లాస్థాయిలో పోటీలు జరగనున్నాయి. అండర్-14 విభాగంలో పాల్గొనే బాలురు, బాలికలు 2012 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలి. అండర్-17కు సంబంధించి 2009 జనవరి 1 తరువాత, అండర్-19కు సంబంధించి 2007 తర్వాత పుట్టిన వారు అర్హులు. ఈ పోటీలు జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పర్యవేక్షణలో జరుగుతాయి.

శాంతి ర్యాలీ విజయవంతం చేయండి

గుజరాతీపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లైబ్రరీ సైన్స్ నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం విజయవాడలో జరగనున్న శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల నాయకుడు జామి శ్రీకాంత్ కోరారు. ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీలో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల లైబ్రరీ సైన్స్ నిరుద్యోగులు పాల్గొనాలని కోరారు.

ఏకపక్షంగా వ్యవహరించొద్దు

సరుబుజ్జిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరువుల పంపిణీలో అధికారులు కపక్షంగా వ్యవహరించవద్దని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాలసత్యనారాయణ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల వ్యవసాయాధికారి మన్మథరావును వారు కలిశారు. రైతు సేవా కేంద్రాల వద్ద పంపిణీ చేయాల్సిన ఎరువులను, ప్రైవేటు వ్యాపారులు వద్ద నిల్వ చేసి కూటమి నేతలు చెప్పిన వారికి వాటిని పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని ఏవోను నిలదీశారు.

దళిత మహాసభ నూతన కార్యవర్గం

రణస్థలం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ దళిత మహాసభ రణస్థలం, లావేరు మండల శాఖల నూతన కారవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రణస్థలం మండల అధ్యక్షుడిగా పల్ల నీలయ్య, ప్రధాన కార్యదర్శిగా ముక్కు రాము, గౌరవ అధ్యక్షుడిగా సాకేటి పోతయ్య, లావేరు మండల అధ్యక్షుడిగా నేతల ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా గంట్లాన మారీష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఉప్పాడ చలపతిరావుతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

న్యూస్ బాక్స్

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీశయన చైతన్య దీపిక-2025 ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు దేవడా మోహనరావు తెలిపారు. ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస మండలాల్లో పదో తరగతి పాసైన శ్రీశయన విద్యార్థులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 500 మార్కులు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 550మార్కులు దాటి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 94400 22665, 94939 07575 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మండల సమావేశం రేపు

కంచిలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.తిరుమలరావు సోమవారం ఒక ప్రకనలో తెలిపారు. సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈదుపురం గ్రామానికి చెందిన జనసైనికుడు నెయ్యిల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు జనసేన క్రియాశీలక సభ్యత్వం ఉండడంతో పార్టీ పీవోసీ దాసరి రాజు సోమవారం సత్యనారాయణ భార్య సావిత్రికి రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దురోధనరెడ్డి, మండల అధ్యక్షురాలు దుర్గాసి నీలవేణి, ఏఎంసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, సంజు, శ్యామ్, రుక్మంగధరావు, బాసి భారతిరెడ్డి పాల్గొన్నారు

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

కవిటి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొర్లెపాడు పంచాయతీలో ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు ఎస్.నారాయణస్వామి, పి.అరెలమ్మ, ఐ.లోకనాథం కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్‌కు పిర్యాదు చేశారు.

కవిటిలో క్విజ్ పోటీలు

కవిటి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి క్విజ్‌పోటీలు జరిగాయి. ముత్యాలపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సంపాదించారు. డిబెట్ పోటీల్లో కవిటి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని పొందారు. వీరంతా జిల్లాస్థాయిలో జరిగేపోటీలో పాల్గొంటారని ఎంఈవో ధనుంజయమజ్జి తెలిపారు. విజేతలకు ఎంఈవోతో పాటు, ప్రధానోపాధ్యాయుడు ఎస్.విశ్వనాథం బహుమతులు అందించారు.

అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు అరెస్టు

- వేర్వేరు కేసుల్లో పట్టుబడిన ముగ్గురు
- కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

పలాస, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర ముఠాను కాశీబుగ్గ పోలీసులు ఆదివారం రాత్రి పలాస రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్నారు. రెండు వేర్వేరు కేసులకు సంబంధించి మొత్తం రూ.1.20 లక్షల విలువైన ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిని సోమవారం పలాస కోర్టులో హాజరుపరిచినట్టు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి పట్టణానికి చెందిన సుస్థీర్ మాలి, రాయఘడ జిల్లా చంపాపూర్ గ్రామానికి చెందిన కిశోర్ చంద్రఖర్జీ, కేరళ రాష్ట్రానికి చెందిన ఫైజల్.. గతంలో వీరు ముగ్గురు కేరళలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ పరిచయం అయ్యారు. కిశోర్ చంద్రఖర్జీ గంజాయి పండిస్తూ వివిధ మార్గాల ద్వారా బ్రోకర్లకు చేరదీస్తుంటారు. ఈ క్రమంలో ఫైజల్‌కు గంజాయిని ఇవ్వాలని సుస్థీర్‌మాలికి చెప్పారు. నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద ఆయన ఉంటాడని చెప్పడంతో రెండు కిలోల గంజాయిని ప్యాకెట్‌గా చేసుకొని సుస్థీర్‌మాలి పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకోగా, సిబ్బందితో తనిఖీలు చేస్తున్న కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తికి పట్టుబడ్డాడు. ఆయన నుంచి సెల్‌ఫోన్, రూ.2,850 స్వాధీనం చేసుకున్నారు. అలాగే నెల్లూరు జిల్లా బుజబుజ గ్రామానికి చెందిన సయ్యద్ సుల్తాన్, బిడిపూడి అరుణ్‌కుమార్ ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి పట్టణానికి చెందిన షేక్ గఫూర్ వద్ద ఆరు కిలోల గంజాయి కొనుగోలు చేసుకొని తమిళనాడు రాష్ట్రం రామాపురం గ్రామానికి చెందిన విషిత్రాదేవికి గంజాయి ఇచ్చేందుకు పలాస రైల్వే స్టేషన్‌కు ఆదివారం రాత్రి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది వారిని తనిఖీ చేస్తూ గంజాయిని గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేసి, సెల్‌ఫోన్, రూ.1020 స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. వీరు కూడా తమిళనాడులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ పరిచయం అయ్యారు. సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


ఉపేంద్ర (ఫైల్)

ఆమదాలవలస, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాబాలవారివీధిలో నివాసముంటున్న గూడాడ ఉపేంద్ర (27) అనే యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సనపల బాలరాజు వివరాల మేరకు.. మండలంలోని మునగలవలసకు చెందిన ఉపేంద్ర సరుబుజ్జిలి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితతో కలిసి డాబాలవారివీధిలోని ఓ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఉపేంద్ర శ్రీకాకుళంలోని ఓ జిరాక్స్ షాప్‌లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాలరాజు ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

రైలునుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

హరిపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మందస రైల్వే స్టేషన్, కొర్రాయిగేటు మధ్య రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం మేరకు సుమారు 40 ఏళ్ల వయస్సు, నలుపు టీషర్టు ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహం పలాస ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు వివరాలకు రైల్వే హెచ్‌సీ డి.హరినాథ్‌ను సంప్రదించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురి అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

ఆమదాలవలస, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిట్టివలస గ్రామానికి చెందిన నవిరి పూర్ణ అనే వివాహిత ఆత్మహత్య కేసులో సోమవారం నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిట్టివలసకు చెందిన నవిరి సింహాచలం, పద్మ దంపతుల కుమార్తె పూర్ణను పట్టణంలోని ఐజే నాయుడు కాలనీకి చెందిన మధుసూదనరావుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిగిందన్నారు. వివాహ సమయంలో అల్లుడికి కట్న కానుకులు ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కావాలని భర్త, అత్తమామలు వేధించడంతో కన్నవారింటికి చేరుకున్న పూర్ణ మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుందన్నారు. దీనికి కారణమైన భర్త మధుసూదనరావు మామ లక్ష్మణ, అత్త సరస్వతి, మరిది ఈశ్వరరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. వారిని స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కంచిలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డీజీపురంలోని ఎరువుల దుకాణాలపై సోమవారం మండల ఫెర్టిలైజర్స్ విజిలెన్స్ కమిటీ అధికారులు దాడులు చేశారు. లడ్డు కేశవ్‌పాత్రోకు చెందిన దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 18 బస్తాల యూరియా, ఆర్గానిక్ ఎరువులు 10 బస్తాలు, కాంప్లెక్స్ ఎరువులు 17 బస్తాలు, గ్రోమోర్ ఐదు బస్తాలు, పొటాస్ 13 ప్యాకెట్ (25 కిలోలు చొప్పున)లను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. కేశవ్‌పాత్రోపై 6ఏ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎరువులు తన సొంతానికి ఉపయోగించుకునేందుకు కొనుగోలు చేశానని, వాటికి సంబంధించి అన్ని బిల్లులు ఉన్నాయని కేశవ్ పాత్రో విలేకరులకు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పారి నాయుడు, తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో జి.వీరభద్రస్వామి, ఏవో కె.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

- హరిపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మందస పట్టణంలోని ఎరువుల దుకాణంలో సోమవారం వ్యవసాయ అధికారులతో కలిసి విజిలెన్స్ ఎస్ఐ ఐ.రామారావు తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నట్లు, ఒడిశా నుంచి నకిలీ ఎరువులు తెచ్చి అమ్మకాలు జరుపుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. ఏవో నాగరాజు, ఏఈవో ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.
- టెక్కలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎరువుల్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు హెచ్చరించారు. సోమవారం మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ, ఏఈఈ ప్రేమ్‌కుమార్‌తో కలిసి నందిగాం, పెద్దతామరాపల్లి వద్ద గల ప్రైవేట్ ఎరువుల దుకాణాలను పరిశీలించారు. రికార్డుల్ని పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.

యూరియా కోసం రైతుల బారులు


నరసన్నపేట: జమ్ము జంక్షన్‌లోని యూరియా పంపిణీ గిడ్డంగి వద్ద బారులుతీరిన రైతులు


కోటబొమ్మాళి: మన గ్రోమోర్ షాపు వద్ద బారులు తీరిన రైతులు


కొత్తూరు: రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

నరసన్నపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మనగ్రోమోర్ కేంద్రం వద్ద సోమవారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఉదయం 7 గంటలకే చేరుకుని క్యూలో నిల్చొన్నారు. ఆధార్ అథంటకేషన్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడింది. గంట తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో గల రైతు సేవాకేంద్రంలో టోకెన్లు ఇస్తామనడంతో అక్కడ నుంచి రైతులు పరుగులు తీశారు. ఇలా యూరియా కోసం రైతు సేవా కేంద్రానికి, మన గ్రోమోర్ కేంద్రానికి తిప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యూరియా పంపిణీ చేసే కేంద్రం వద్ద ఉద్రక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అయితే గంటలు కొద్దీ క్యూలో ఉన్నా కొంతమంది రైతులకు యూరియా అందకపోవడంతో నిరుత్సాహపడ్డారు.

- కోటబొమ్మాళి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవారం ఏ ఎరువుల దుకాణం వద్ద చూసినా రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. లైన్‌లో నిలబడి ఉన్న రైతుకి ఒక బస్తా చొప్పున అందచేశారు. స్టాక్ అయిపోయిందని చెప్పడంతో నిరాసతో వెనుదిరిగారు. లోగల జీయన్నపేట గ్రామ రైతులకు వరి సాగుకు ఎంతో మొత్తంలో యూరియాను వాడాలన్నది ఉపాధిహామీ ఏపీవో జి.హరిప్రసాద్ అవగాహన కల్పించారు. ఉపాధి టీఏ రాంబాబు, కార్యదర్శి రమేష్, రైతులు పాల్గొన్నారు.
- ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎల్ఎన్ పేట జంక్షన్‌లో గల మనగ్రోమోర్ సెంటర్ వద్ద సోమవారం యూరియా పంపిణీ చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు ఉదయం గంటల నుండే క్యూ కట్టారు. షాపు నుంచి అలికాం-బత్తిలి రోడ్డు మీదకు క్యూ సాగింది. దీంతో రైతుల మధ్య తోపులాటలు చేటుచేసుకుంది. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సింహాచలం మనగ్రోమోర్ సెంటర్‌ను సందర్శించి రైతులకు సర్ధి చెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.
- పలాస రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటకు కావాల్సిన ఎరువులను ప్రతీ రైతుకు అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ ఎన్.కల్యాణ్ చక్రవర్తి, ఏవో పి.పోలారావు అన్నారు. సోమవారం బొడ్డపాడు, మాకన్నపల్లి రైతుభరోసా కేంద్రాలను వారు పరిశీలించారు. వీఆర్‌వోలు వీఏవోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.
- కొత్తూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం గ్రోమోర్ కేంద్ర వద్ద సోమవారం రైతులు ఆందోళన చేశారు. గ్రోమోర్ కేంద్రం వద్ద ఎరువులు విక్రయించనున్నట్టు ముందుగానే అధికారులు ప్రకటించారు. దీంతో మండల నలుమూలు నుంచి భారీ సంఖ్యలో రైతులంతా చేరుకోవడంతో కాసేపు పంపిణీ నిలిపివేశారు. దీంతో రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాలకృష్ణ, సీఐ ప్రసాద్, ఎస్ఐ ఎండీ అమీర్ అలీ, ఏవో శ్రావణి అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.
- పాతపట్నం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెంబూరు, చంగుడి గ్రామాల్లో యూరియా పంపిణీను సోమవారం నిర్వహించారు. తెంబూరులో 100, చంగుడిలో 80 బస్తాల యూరియా పంపిణీ చేసినట్టు ఏవో కీరవాణి తెలిపారు. కాగా వెంకటాపురం గ్రామానికి చెందిన నేలయ్య తదితర రైతులకు యూరియా అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు.
- నందిగాం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియాపై వస్తున్న తప్పుడ ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని టీడీపీ మండల అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ మళ్ల బాలకృష్ణ అన్నారు. సోమవారం వారు నందిగాంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటుందన్నారు.


ఎల్ఎన్ పేట: మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద..


పాతపట్నం: తెంబూరులో యూరియా పంపిణీ కేంద్రం వద్ద..


పలాస రూరల్: బొడ్డపాడులో ఎరువుల పంపిణీ

పాఠశాల వద్ద ఇలా.. చదువులెలా?


పాఠశాల వరండాలో ఇలా...


చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

మెళియాపుట్టి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదేంటీ...చెరువు ఒడ్డున ఎవరైనా పాఠశాలను నిర్మిస్తారా? అని ఆశ్చర్యపోతున్నారా? మీరు అనుకున్నట్టు చెరువు ఒడ్డున పాఠశాల లేదు. పాఠశాల ఆవరణే ఇలా చెరువులా మారిపోయింది. ఈ ఒక్క రోజే కాదు... వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి. ఇదీ జాడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద దుస్థితి. సోమవారం సాయంత్రం వర్షం కురవడంతో పాఠశాల ఆవరణలో ఇలా నీరు నిలిచింది. ఇక్కడ గతంలో నాడు-నేడు పనులు చేశారు. పాఠశాల ప్రాంగణంలో మట్టిని పూర్తిగా వేయకపోవడంతో నీరు ఇలా నిలిచిపోతోంది. సెలవు రోజుల్లోనూ... ఉదయం వేళల్లోనైతే పిల్లలు ఇళ్ల వద్దనే ఉండిపోవడానికి అవకాశం ఉంటుంది. కానీ పాఠశాల పని వేళల్లో వర్షం కురిస్తే విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉపాధ్యాయులదీ అదే పరిస్థితి. ఆవరణ చెరువులా ఉండడమే కాదు... తరగతి గదుల్లోకీ వర్షం నీరు చేరుతోంది. దీంతో పిల్లల పుస్తకాలు, పాఠశాల రికార్డులు తడిసిపోతున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పాఠశాల పరిసరాలను మెరుగుపరచాలని వారంతా కోరుతున్నారు.

సకాలంలో యూరియా అందించేందుకు కృషి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు

నరసన్నపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సకాలంలో రైతులకు యూరియా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కరగాం రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల ఇతర దేశాలతో జరిగిన స్వల్ప వివాదాలతో యూరియా దిగుమతిలో జాప్యం జరిగిందని, అందువల్లే ఈ సమస్య ఏర్పడిందన్నారు. వ్యవసాయ అధికారులు సూచించినట్టు తక్కువ మోతాదులోనే యూరియా వాడాలన్నారు. కార్యక్రమంలో ఏడీ వెంకటమధు, తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ, పోలాకి పీఏసీఎస్ ఛైర్మన్ బైరి భాస్కరరావు, సర్పంచ్ పంగ బావాజీనాయుడు, నీటి సంఘం అధ్యక్షులు శిమ్మ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం యూరియా అధిక మోతాదులో వినియోగించడం వల్లే కలిగే అనార్థాలపై వ్యవసాయశాఖ జారీ చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టెక్కలి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీకేథరిన్ తెలిపారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, వైద్యసిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వైద్యాధికారి సునీత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల వ్యాధులపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నందిగాం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల మృత్యువాతకు అంతర్గత పరాన్నజీవుల మిశ్రమ సంక్రమణ, నీలి నాలుక వ్యాధే కారణమని జంతువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు కిశోర్ అన్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'గొర్రెల మృత్యువాతపై ఆందోళన' కథనానికి అధికారులు స్పందించారు. పశువైద్యాధికారి జి.మన్మధరావుతో కలిసి గొర్రెలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీలినాలుక వ్యాక్సిన్లు వేయించాలని, నులుపురుగుల నిర్మూలన వెంటనే చేపట్టాలని గొర్రెల కాపరులకు సూచించారు. గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండి సకాలంలో తమ గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్లు వేసుకోవడం ద్వారా వ్యాధులు నిర్మూలించి తద్వారా మృత్యువాత పడకుడా ఉంటాయని వివరించారు. ఈయనతో గోపాలమిత్ర ఈశ్వరరావు ఉన్నారు.

రణభేరి జాతాను విజయవంతం చేయండి



కాశీబుగ్గ, సెప్టంబరు 8(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిశోర్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రణభేరి పోస్టర్‌ను విడుదల చేశారు. మూడు నెలలుగా ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని, డీఏలు విడుదల చేయాలని, ఐఆర్ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సభ్యులు బాబురావు, రమేష్, కోదండరావు, బల్ల చిట్టిబాబు, ఎల్.వెంకటాచలం, జయరాం, రమణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌కు దరఖాస్తు చేస్తే.. కారు ఉందంట

టెక్కలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాను 90శాతం దివ్యాంగురాలినని, పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే తనకు నాలుగు చక్రాల వాహనం(కారు) ఉందని పింఛన్ తొలగించారని, తనకు ఏరకమైన ఉపాధి లేదని టెక్కలికి చెందిన గొంటి వెంకటరత్నం సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి అర్జీ అందజేశారు. మరికొంతమంది తమ సమస్యలను విన్నవించుకున్నారు.

- పాతపట్నం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒడిశా అధికారుల నుంచి పరిరక్షించాలని ఏఎస్ కవిటి గ్రామ రైతులు తహసీల్దార్ నందిగామ ప్రసాదరావుకు వినతిపత్రాన్ని సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో అందజేశారు. ఈ నెల 5న ఒడిశాకు చెందిన రెవెన్యూ, పోలీసులు అధికారులు ఒడిశాలో పట్టాలు పొందిన పలువురు రైతులు మాకు తెలియకుండా మా పొలాల్లో కొలతలు వేయడంపై ఆందోళన ఆందోళన వ్యక్తం చేశారు. పాలనాధికారికి వినతిపత్రం అందజేశారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

నరసన్నపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రం రాంచీ పట్టణంలో నిర్వహించనున్న జాతీయ స్థాయిలో నిర్వహించనున్న యోగా పోటీలకు నడగాం గ్రామానికి చెందిన బొత్స మనోహర్ నాథ్ ఎంపికయ్యారు. డిసెంబరు 27 నుంచి జరిగే ఈ పోటీలకు రాష్ట్రం నుంచి హాజరుకానున్నట్లు తండ్రి బొత్స కేధారీనాథ్ తెలిపారు. యోగా అసోసియేషన్ స్పోర్ట్సు అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6,7న ద్వారక తిరుమలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మనోహర్ సత్తా చాటా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

నిరుపేదలకు వరం 'సీఎంఆర్ఎఫ్'

పోలాకి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదలకు వరం వంటిదని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన దీర్ఘాశిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పాగోటి సూర్యారావుకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.5,10,230 చెక్కును ఎమ్మెల్యే బాధితుడి భార్య ఈశ్వరమ్మకు అందచేశారు. అలాగే జడూరులో మాజీ జడ్పీటీసీ గొండు రామన్నను రోడ్డుప్రమాదంలో గాయపడిన బోర శ్రీనివాసరావును, చింతు తేజేశ్వరరావు, చింతు నాగయ్యను పరామర్శించారు.

రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలకు జిల్లా జట్టు

పలాస, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టు ఎంపిక సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో జరిగింది. రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, పీడీ తవిటయ్య పర్యవేక్షణలో ఎంపిక నిర్వహించారు. పురుషుల విభాగంలో బి.సిద్ధార్థ, కె.ప్రవీణ్‌కుమార్, బి.ఉదయ్‌కిరణ్, ఎల్.రోహిత్‌కుమార్, మహిళ విభాగంలో పి.శ్రావణిపాత్రో, ఎస్.దివ్య, పి.కావ్య, కె.వసుంధర ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రవికుమార్, క్రీడా ప్రోత్సాహకుడు మల్లా భద్రయ్య, జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సంతోష్‌కుమార్, కార్యదర్శి పి.జోగారావు, విద్యాకమిటీ ఛైర్మన్ కె.తారక్, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

మెళియాపుట్టి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథలయ అధికారి అనురాధ ఆధ్వర్యలో అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అక్షరాలు నెర్పించడం మన కర్తవ్యం అని తెలిపారు. కార్యక్రమంలో అనురాధ,నలంద ప్రిన్సిపాల్ ప్రతాప్, ధర్మారావు, హేమలత, శారద, తదితరులు ఉన్నారు.

గరుడపత్ర టీడీపీ అధ్యక్షుడిగా గణపతి


కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): గరుడపత్ర పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా కోనారి గణపతి, ఉపాధ్యక్షుడిగా అంబటి శ్రీహరి, ప్రధానకార్యదర్శిగా కోనేరు వల్లభరావు, కోశాధికారిగా రాపాక తాతారావులను సోమవారం ఎన్నుకున్నారు. పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లష్టర్ ఇన్‌చార్జి హేమబాబు చౌదరి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

టెక్కలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్ల సంక్షేమ సంఘం భవనంలో బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంఘ అధ్యక్షుడు రేణంకి రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లతో పాటు ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

కన్యాకుమారి సినిమాలో ఉద్దానం జానపద గీతాలు

పలాస రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన కన్యాకుమారి చిత్రంలో ఉద్దానం వాసులు జానపద గాయకుల గీతాలను చేర్చి ఉద్దాన ప్రాంత గీతాలకు చక్కని గౌరవం కల్పించారని గిడుగు జానపద కళాపీఠం, బద్రి అప్పన్న స్మారక పీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సినిమాలో వరికోతల సమయంలో పాడుకునే జానపద పాటలు సుక్కల్లో సందురుడు, నోమి, నోమన్నలాలో చందమామా వంటి జానపద గీతాలను దున్న శకుంతల, సాలిన జోగారావు, కోటేశ్వరరావు, పద్మావతి కీలు మహాలక్ష్మి, తెప్పల ఉమా, బతకల గున్నమ్మ ఆలపించారు. నిజమైన ఉద్దానం గీతాలను ఆలపించేందుకు అవకాశం కల్పించడం గొప్ప విషయమన్నారు. ఉత్తరాంధ్ర జానపద గీతాలను పాడేందుకు అవకాశం ఇచ్చిన దర్శకుడు అట్టాడ సృజన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఈ సినిమా ఆగస్టు 27న రిలీజ్ అయి పాజిటివ్ టాక్‌తో సాగుతుంది.

వాహనం ఢీకొని 13 గొర్రెల మృతి

రణస్థలం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) పైడిభీమవరం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున విశాఖ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం గొర్రెలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 13 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 9 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వాహనం ఆపకుండా వెళ్లిపోయినట్లు బాధితుడు పిట్ట రమణ తెలిపారు. రూ3లక్షల వరకూ నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు. ఈ మేరకు జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యలు పరిష్కరించాలి

హిరమండలం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వంశధార నిర్వాసితులు గ్రామాలు ఖాళీ చేసి పదేళ్లు పూర్తి కావస్తున్నా వారి సమస్యలు అలాగే ఉన్నాయని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం శ్రీకాకుళం జిల్లాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

12న సర్వసభ్య సమావేశం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 12వ తేదీన ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ సమావేశం 12వ తేదీ ఉదయం 10.30లకు ప్రారంభమవుతుందని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

ర్యాలీ విజయవంతం చేయాలి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో రైతు సమస్యలపైన, యూరియా కొరత పై ఈ నెల 9న జరగనున్న అన్నదాతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం 10 గంటలకు టెక్కలిలోని పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని, అక్కడ నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వరకు వెళ్లి రైతుల సమస్యలు పై వినత పత్రం అందజేస్తామన్నారు. పార్టీ నాయకులు, కారకర్తలు ఉన్నారు.

పోరాటం తప్పదు

నరసన్నపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కారించాలని, యూరియా, డీఏపీలను అందించాలని సీపీఐ నాయకులు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణరావు, లవకుమార్, భాస్కరరావు, మన్మథ, వాసు, రాజు, కుమార్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.